# మసక

-సర్వజిత్

నాలుగైదు రోజులుగా భార్య ధనలక్ష్మి పెడుతున్న హైరానాకి, చేస్తున్న హడావిడికి మాధవరావుకి నవ్వు వస్తోంది. మరోప్రక్క 'వెర్రిమాలోకం' అని జాలిగానూ అనిపిస్తోంది.

నిజానికి ఆమె హడావిడి వారం కిందటే మొదలయ్యింది. రెండు రోజులు మనసులోనే మల్లగుల్లాలు పడింది. మూడో రోజు నుంచి హడావిడి మొదలెట్టింది.

పూర్వకాలం ఇల్లయినా, హాలు, రెండు గదులు, వంటిల్లూ, వరండా కట్టి ఉంది మాధవరావు ఇల్లు. ఓ గది తాము వాడుకుంటున్నారు. మరో గదిలో అవీ ఇవీ, పనికొచ్చేవీ, పనికిరానివి సామాన్లు పడేసి ఉన్నాయి.

ఆ సామానంతా ధనలక్ష్మి బయటికి తీయించింది. ఒకటీ అరా అవసరమనుకున్నవి వంటింట్లో సర్దుకుని, మిగిలినవి అటకెక్కించేసింది.

చిన్నా చితకా పనుల్లో సాయం చెయ్యడానికి, ఎక్కువసేపు కబుర్లు చెప్పుకోవడానికీ ఎప్పుడూ వస్తుండే పక్కింటి సత్యవతిని పిలిచి ఆ పనులన్నీ చేయించింది ధనలక్ష్మి.

"ఇప్పుడియన్నీ సర్దుతున్నారెందుకమ్మగారూ?" అని సత్యవతి అడుగుతున్నా, 'చెబుతానుండవే' అంటూ తాను హడావుడి పడుతూ, దాన్నీ కంగారు పెడుతోందావిడ.

మూడు, నాలుగు రోజులుగా భార్యలో వచ్చిన మార్పూ, పడుతున్న హైరానా, దాని వెనకాల కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న ఆనందం మాధవరావుకు అర్థం కాక పోలేదు. అందుకే భార్యను చూస్తుంటే నవ్వొస్తోందాయనకు.

గదిలో శుభ్రంగా సున్నం వేయించింది. కిటికీలకు రంగూ వేయించింది. కిటికీకి దగ్గరగా బాగా గాలి వచ్చేట్టు, అలాగే ఫ్యాను గాలి బాగా తగిలేట్టూ మంచం వేసి, పరుపు వేసి కొత్త దుప్పటి పరచింది. అంతకు రెండు రోజుల ముందు పరుపును ఎండలో ఆరబెట్టి దుమ్ము బాగా దులిపించింది.

అన్ని సర్దడాలూ అయిన తరువాత గుమ్మంలో నిల్చుని గదిని ఒకసారి కళ్లారా చూసుకుని సంతృప్తి పడింది.

"రూము రెడీయా?" భార్య వెనకాల నిల్చుని అడిగాడు మాధవరావు.

"ఊ... బావుందా?" సంబరంగా భర్తకేసి చూసి అడిగిందామె.

"నువ్వు చేతనైనంత చేశావ్ ధనం... బావుంది" అన్నాడు మాధవరావు.

భర్త మాటకు ఆమె మరింత సంతోషపడింది.

పెరట్లోకి వచ్చి చెట్టుకింద కుర్చీలో కూర్చుంటూ "ఈ గది... ఈ ముస్తాబూ ఏమేరకు పనికొస్తాయో' అనుకున్నాడాయన.

ఆ మర్నాటి నుంచీ ఇంటిని పండుగ ముస్తాబు చేయించింది. పెరట్లో మొక్కల దగ్గరా శుభ్రం చేయించింది. ఇక ఏం పిండి వంటలు చేయాలా అని ఆలోచిస్తూ సతమతమైపోయింది ధనలక్ష్మి. ఆ విషయం భర్తని అడిగితే-

"ధనం! పెద్దగా ఆలోచించి తలనొప్పి తెచ్చుకోకు. అబ్బాయికేది ఇష్టమో అవి చెయ్యి చాలు" అన్నాడు.

"మరి కోడలు?... మనవడు?" భార్య కొత్త సంశయం వ్యక్తం చేసింది.

"మనవడు చిన్న పిల్లాడు. ఇక కోడలంటావా... ఆమె ఇష్టాయిష్టాలు మనకు తెలియవు..."

భర్త అన్నదీ నిజమే ననిపించిందామెకు...

కొడుకు అభిరుచులు, అలవాట్లు తల్లిగా తనకు తెలుసు... 'ఏవన్నా పెట్టమ్మా...' అంటూ డబ్బాలు వెతుక్కునేవాడు. అతని కోసం ఎప్పుడూ ఏదో ఒకటి చేసి డబ్బాల్లో పెడుతూండేది తను. ఇంజనీరింగ్ స్టూడెంట్ అయినా అతనికా అలవాటు పోలేదు.

కొడుకు అచ్యుతానందం కష్టపడి చదువుకున్నాడు. ఇంటర్‌లో మంచి మార్కులు తెచ్చుకున్నాడు. ఎంసెట్‌లోనూ మంచి ర్యాంకే తెచ్చుకొనడంతో ఇంజనీరింగ్ చదివించడం మాధవరావుకి ఏమంత కష్టం అనిపించలేదు.

అగ్రికల్చర్ కార్యాలయంలో సీనియర్ క్లార్క్‌గా పనిచేస్తున్న మాధవరావుకి అచ్యుతానందం, అలివేలు- ఇద్దరే సంతానం. మొదట్నుంచీ పద్ధతయిన మనిషి మాధవరావు. ఆయనకు తగ్గట్లే ఒద్దికయిన భార్య

ధనలక్ష్మి.

పిల్లలిద్దరూ బుద్ధిమంతులేనని అందరూ అంటుంటారు. ఆ మాటలు ఆ దంపతుల గుండెలనిండా ఆనందం నింపుతుంటాయి. పిల్లలు బుద్ధిమంతులని పరులు పొగడ్డం కన్నా తల్లిదండ్రులకు ఆనందం ఇంకేం ఉంటుంది!

అచ్యుతం ఒబ్బిడిగానే గడుపుకుని, కష్టపడి చదువుకుని ఇంజనీరయ్యాడు. ఆ విషయం ఆనోటా ఆనోటా బంధువులు నలుగురికీ తెలిసింది. కొందరు సంబర పడ్డారు. కొందరు అసూయపడ్డారు. కొందరు మెటికలు విరిచారు.

ఆ మాట టౌన్‌లో పెద్ద చిట్‌ఫండ్ వ్యాపారి, ఇంకా ఇతర బిజినెస్సులూ ఉన్న సుబ్బన్న దృష్టికీ వెళ్లింది. ఈ మధ్య కూతురు వాసంతికి సంబంధాలు కూడా అన్వేషిస్తున్నాడాయన.

వాసంతి బిఎస్సీ చదివింది. అసలు అందం కన్నా ఆమెలో డబ్బు తెచ్చిన ఆనందం, దాని వెనకాల అతిశయం తొంగిచూస్తుంటాయి. దానికితోడు హోదా తెచ్చిన గారాబం కూడా ఉంది.

అందుకే కూతురు వాసంతికి ఇల్లరికం అని కాదుగానీ, ఇల్లరికం లాంటి భర్తను తేవాలనుకున్నాడు సుబ్బన్న. ఆ సమయంలోనే అచ్యుతం గురించి యథాలాపంగా విన్నాడు. డొంక తిరగేస్తే మాధవరావుకూ, తనకూ ఎక్కడో బీరకాయ పీచు సంబంధమూ తగిలింది.

దాంతో అచ్యుతం గురించి వాకబు చేశాడు సుబ్బన్న. కుర్రాడు బుద్ధిమంతుడన్నారంతా. లేనింటి పిల్లను తెచ్చుకుంటే అణిగి మణిగి ఉంటుందనుకున్నట్లే, తనకన్నా చాలా కింద మెట్టుమీదున్న అబ్బాయిని అల్లుడిగా చేసుకుంటే ఇటు అమ్మాయికి భర్తగా, ఉత్తరోత్తరా అటు తనకీ ఉపయోగపడతాడని సుబ్బన్న చాలా ముందుచూపుతో ఆలోచించాడు.

అనుకున్నదే తడవుగా అచ్యుతం ఇంటికి వెళ్లాడు. సుబ్బన్నని చూసి, అతని మాటవినీ ఆశ్చర్యపోయాడు మాధవరావు. కాస్సేపటికి తేరుకుని అన్నాడు: "ఇంజనీరింగ్ చేశాడు మా అబ్బాయి. కానీ ఇంకా ఉద్యోగం సజ్జోగం ఏమీ లేదండి. అప్పుడే పెళ్లి చేయాలనీ అనుకోవడం లేదండి."

"ఉద్యోగం ఒక్కటే సమస్య అయితే పర్వాలేదు. ఇరవై నాలుగ్గంటల్లో మీవాడు ఉద్యోగస్తుడవుతాడు... వేరే సమస్యలుంటే చెప్పండి?" అన్నాడు సుబ్బన్న.

## మన వివేకానందుడు

స్వర్గఖండమందు పుట్టి
లక్ష్యాన్ని సాధించినావు
భరతమాత కీర్తిని
విశ్వమంత చాటినావు
నీ మాటకు సాటిలేదు
నీ ఘనతకు లోటులేదు
వివేకమును ప్రదర్శించి
విశ్వమందు నిలిపినావు
చిన్ననాటి దానగుణం
మరువలేని మంచితనం
ఎల్లకాలమునుంచినావు
జగతిలోన వెలిగినావు
విదేశాల సభలలోన
భరతదేశ చరిత చెప్పి
సోదర ప్రేమను నిలిపి
సాదరమును పొందినావు
ఝరిలా సాగే భాషణ
ధైర్యాన్ని పెంచే భాషణ
భవితను దిద్దే భాషణ
భవమును ద్రుంచే భాషణ
నీ మాటలు మణిమూటలు
ఆలోచనలకు బాటలు
మంచిని నేర్పే గీతలు
మరువలేని మణికోటలు
"నీలోనున్నది శక్తి
లేచి చూపు నీ యుక్తి
భయమెందుకు ఓ వ్యక్తి!"
అనే నరేంద్రుని సూక్తి
విశ్వానికి ముఖ్యమన్న
విలువ ఉన్న మాటలన్న
విన్నవారి భాగ్యమన్న
విలువ తెలిసి నడవమన్న

*(12 జనవరి – శ్రీ వివేకానందస్వామి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని)*

–సి. శ్రీ.

మాధవరావుకి ఏం చెప్పాలో తోచలేదు. సుబ్బన్న స్థితిగతులు ఆయనకు బాగా తెలుసు.

నిజానికి ఉద్యోగం వచ్చాక మరో రెండేళ్లు పోయాక, అప్పుడు అచ్యుతానికి పెళ్లి చేద్దామని అనుకున్నాడు మాధవరావు. అంతకు మించి కాదనడానికి వేరే కారణం కనిపించలేదు మాధవరావుకి.

ఆ తరువాత బంధువర్గాన్ని మాధవరావు మీదకి తోలాడు సుబ్బన్న– 'మంచి సంబంధం. వదలుకోకు' అంటూ వాళ్లు చెవిలో జోరీగల్లా గుయ్‌మనడం మొదలెట్టారు. 'నువ్వు ఊ అంటే రేపీపాటికి మీవాడు ఉద్యోగస్తుడైపోతాడు' అంటూ ఆశల పల్లకీ ఎక్కించేశారు.

మాధవరావులో సంఘర్షణ మొదలయ్యింది.

"ఎవరో ఒకరి అండ ఉంటేనే ఈ రోజుల్లో రాణించగలం. పైకి రాగలం. అచ్యుతం పైకి వెళ్లాలంటే తన పరిచయాలు, తన శక్తి చాలదు. అందరూ చెబుతున్నట్టు ఇది మంచి అవకాశమేనేమో? కాదంటే చేతులారా వాడి భవిష్యత్తును పాడుచేసిన వాడినవు తానేమో"– అని పరిపరి విధాల మాధవరావు తర్జన భర్జన పడ్డాడు.

కానీ, కయ్యానికైనా, వియ్యానికైనా సమవుజ్జీ ఉండాలన్న విషయం ఓ మూల అతని మనసులో కదలాడింది. కడకు అచ్యుతాన్ని అడిగాడు. "ఎవరో ఒకరి రికమండేషన్ ఉంటేనే మంచి ఉద్యోగం వస్తుంది మరి!" అన్నాడు.

"ఇంకా ఆలోచనెందుకండి. మంచి సంబంధం. అలాంటి మామగారి అండ వాడికి ఉండడమూ మంచిదేకదా!" అని భార్య ధనలక్ష్మి సలహా ఇచ్చింది.

ఇక ఆ సంబంధం అంగీకరించక తప్పలేదు మాధవరావుకి.

వారం రోజులకల్లా అచ్యుతం హైదరాబాద్‌లో ఉద్యోగంలో చేరాడు. మరో నెలకి వాసంతితో అతని పెళ్లీ జరిగిపోయింది.

వాసంతి అత్తింట్లో కష్టపడి వారం రోజులుండి పుట్టింటికి వెళ్లిపోయింది. నెల గడిచాక ఆమె భర్త దగ్గరికి కాపురానికి వెళ్లింది.

నాటినుంచి అచ్యుతం చిరునామా మాధవరావు కొడుకుగా కాకుండా సుబ్బన్న అల్లుడిగా మారిపోయింది. తొలి పండక్కని వచ్చినప్పుడూ, ఒక్కరోజే తల్లిదండ్రుల దగ్గర ఉన్నాడు అచ్యుతం. తరువాత ఆర్నెల్లకి అమెరికా వెళ్లిపోయాడు.

వాసంతి పుట్టింటికి వచ్చేసింది. మరో ఆర్నెల్లు గడిచాక వాసంతి కూడా భర్త దగ్గరికి అమెరికా వెళ్లిపోయింది. వెళ్లేటప్పుడు మాత్రం అత్త మామల్ని చూడవచ్చి ఓ పూట ఉంది.

ధనలక్ష్మి మనస్సు చివుక్కుమనిపించింది. కొడుకు అమెరికా వెళితే కోడలు కొన్నాళ్లు తమ దగ్గరే ఉంటుందన్న ఆశ నెరవేరలేదు. పెళ్లయ్యాక కోడలు పట్టుమని నెలరోజులన్నా అత్తింట్లో లేకపోవడం ఆమెకు చాలా బాధగానే ఉంది. ఆ మాటే భర్తతో అన్నదామె.

మాధవరావుకి వెంటనే ఏం సమాధానం చెప్పాలో తోచలేదు. తన గుండెల్లోనూ అది ముల్లులా గుచ్చక పోలేదు. పెళ్లయ్యాక కొడుకు ప్రవర్తనలోనూ ఏదో తేడా కనిపించిందాయనకు. కానీ, తను బయట పడలేదు.

"పరిస్థితులు ఎప్పుడూ ఒకలాగుంటాయా? ఉం

## అమ్మప్రేమ

ఎండ వేడిమిలో
చల్లని తేనీరు
కష్టనష్టాలలో
ఓదార్పు నేస్తం
సంతోష సమయాల్లో
తొలి పలుకు గ్రహీత
హృదిలో అనుక్షణం మెదిలేది
జన్మంతా ఊపిరిగా నిలిచేది
ఎంత చెప్పినా తరగనిది
తుది ఎరుగనిది అమ్మ ప్రేమ

## హైకూ

'క్యూ'లో
పళ్ళెం పట్టుకొని
భిక్షానికి కాదు
బఫేకి

## నానీ

అతను
బట్టలనే కాదు
అక్షరాలనూ మనసుల్నీ కూడా
కుడతాడు

–యలమర్తి అనూరాధ

దవుగాక ఉండవు. కొత్త బంధుత్వాలొస్తాయి. పాతవి కాస్త కనుమరుగవుతాయి. కొన్ని మరీ చెరిగిపోతాయి. మరికొన్ని సందర్భాల్లో కొత్త బంధుత్వాలు ఎన్ని కలిసినా పాతవి పటిష్ఠంగానే ఉంటాయి. గుండె మూలల్లో గూడు కట్టుకుని, అప్పుడప్పుడు అనుభూతులు చిలకరిస్తూ కదిలిస్తూ ఉంటాయి..."

కొడుకు అచ్యుతం మనస్సు, తత్వమూ మాధవరావుకు బాగానే తెలుసు. కాని, కొత్త బంధాలు అతడిని కట్టివేస్తున్నాయనీ ఆయనకు అర్థమయింది. అందుకే భార్య పడుతున్న అవస్థకి ఎలా సమాధానం చెప్పాలా అని కొద్దిసేపు మౌనం వహించాడు.

"కోడలుకి మన ఇంట్లో కొత్త కదా! అంతకు ముందు అబ్బాయితో పాటు కొన్నాళ్లు ఇక్కడ ఉండి ఉంటే, అబ్బాయి అమెరికా వెళ్లినా ఇక్కడే ఉండేది... అయినా ఎక్కడుంటే ఏమిటి ధనం..." అన్నాడాయన భార్య ధనలక్ష్మితో.

భర్త మాటలు ఆమెకు సంతృప్తి కలిగించలేదు. ఆమెకే కాదు, ఏదో భార్యతో చెప్పాడే కానీ, ఆయనకే ఆ మాటలు సంతృప్తిగా అనిపించలేదు.

○ ○ ○

అలా అమెరికా వెళ్లిన అచ్యుతం అప్పడప్పుడు ఎదురింటి వారికి ఫోన్‌చేసి తల్లిదండ్రుల్ని పిలిపించుకుని మాట్లాడేవాడు. రానురానూ ఆ ఫోన్లూ తగ్గాయి.

"నీకేం మాధవరావూ కొడుకుని అమెరికా పంపించేవు. ఏడాదికి ఈ ఇల్లూ మారిపోతుంది, నీ సైకిలు స్థానే కారూ వచ్చేస్తుంది..." మిత్రులు పరిహాసంగానో, అసూయగానో అన్న మాటలు అప్పుడప్పుడు మాధవరావు గుండెల్ని కదిలిస్తున్నాయి.

నిజానికి కొడుకు నుంచి ఆయన అలాంటివేమీ ఆశించలేదు. వాడి మానాన వాడు కులాసాగా, హాయిగా ఉంటే చాలనుకున్నాడు. ఆ తరువాత కూతురు పెళ్లి చేశాడు మాధవరావు. పెళ్లికి కొడుకు, కోడలు వస్తారనుకున్నాడు. రాలేదు. లక్ష రూపాయలు మాత్రం పంపించేడు అచ్యుతం చెల్లెలు పెళ్లికి.

అచ్యుతం అమెరికా వెళ్లి ఏడాది పైగా గడిచింది. 'భార్య వాసంతి గర్భిణి అని, పురుడు అమెరికాలోనే పోసుకుంటుందనీ' ఓరోజు ఉన్నట్లుండి ఫోన్‌చేసి చెప్పాడు అచ్యుతం. 'అమ్మ అమెరికా రాగలదా వాసంతికి తోడుగా ఉండేందుకు... అమ్మకి కష్టమేమో... ఇక్కడ అడ్జస్టు కాలేదేమో...' అన్నాడు అచ్యుతం. ప్రశ్న, జవాబు అన్నీ తనే చెప్పేసుకున్నాడు.

కొడుకు ధోరణి మాధవరావుకి బాగానే అర్థమయింది. ఆ పిలుపు మాటవరుసకే గాని, గుండె లోతుల్లోంచి వచ్చింది కాదని, ఆ ఏర్పాట్లు ఇంతకు ముందే జరిగిపోయి ఉంటాయనీ ఆయనకి అర్థమయింది.

కానీ, ధనలక్ష్మి చాలా బాధపడిపోయింది. "వెర్రి నాగన్న ఎంత అవస్థ పడుతున్నాడో... పోనీ వెళ్లమంటారా?" అనడిగింది భర్తని. "ఎక్కడికి? అమెరికా వెళ్తావా?... ఇరవై గంటలు పైగా విమానంలో కూర్చోవాలి... నీ వల్ల కాదు ధనం" అన్నాడాయన అనునయంగా, భార్య నొచ్చుకోకుండా.

"అవున్లెండి! నేను చదువుకున్నదాన్నీ కాదు..." చదువుకోనందుకు అప్పుడు చాలా బాధపడిపోయింది ధనలక్ష్మి.

ఆ తరువాత నెల రోజులకి తెలిసింది వాసంతి పురిటికి ఆమె తల్లి అమెరికా వెళ్లిందని. అలా అచ్యుతానికి కొడుకు పుట్టడమూ, అత్తగారు ఆర్నెల్లు అక్కడ ఉండి రావడమూ జరిగిపోయాయి.

మరో ఆర్నెల్లకి ఇండియా వద్దామనుకున్న అచ్యుతం ఉద్యోగ కారణాల వల్ల రాలేకపోయాడు. ఆ తరువాత ఏడాది అమెరికాలో ట్రేడ్ సెంటర్ భవనాలు కూలిపోవడమూ, వగైరా కారణాల వల్ల రాలేక

## ప్రతిక్షణం

నీ కలలన్నీ
నా కళ్లల్లో...
నీ గుసగుసలన్నీ
నా మనసులో...
నీ మమకారం
నా చిరునవ్వులో...
నీ పాటలన్నీ
నా గొంతులో...
నీ బంధం
నా ఆత్మీయ దృశ్యం
నీతో నడిచిన అడుగులు
నాకు మిగిలే జ్ఞాపకాలు
ఇది...
నువ్వు నేనైనంత నిజం
నేనే నువ్వయిన ప్రతిక్షణం

-డా॥ సి. భవానీదేవి

పోయాడు.

ఇప్పుడు కుర్రాడికి మూడో ఏడు నిండుతున్న సమయంలో ఇండియా వస్తున్నట్టు ఫోన్ చేశాడు అచ్యుతం.

## గాలిపటం

గాలిపటం
గాలిపటం
గగనాన పక్షిలాగ
తిరుగాడు గాలిపటం
గాలి అలల
ఊగి, తూగి
పైపైకి దూసుకెళ్ళి
ఆటాడు గగననాగు
తోకలేని
పక్షి పిల్లలా
దూరాన తేలియాడు
కాగితపు గరుడ పక్షి
మాంజా కట్టి
చరఖా తిప్పి
వదిలితే బిర బిర బిర
రాకెట్టు లాగ సాగు
చూపుడు వేలి
విన్యాసాలు
ఒక నాట్యం
ఒక వ్యూహం
గిరగిరలు పోయేవి కొన్ని
తలకిందులయ్యేవి కొన్ని
కోతలు పెట్టేవి మరికొన్ని
కేరింతల గాలిపటాలు
ఎదుటి వాడి
గాలిపటం
ఎగిసిపడే పౌరుషాలు
తెగిపడిన కేరింతలు
ఆట ఆట
గాలిపటం ఆట
అవని అంతట ఉంది
ఆడుకుందాం రండి
హద్దులన్ని తుడ్చేద్దాం రండి

-జె. కొండన్న

ఆ ఫోను వచ్చినప్పట్నించీ ధనలక్ష్మి హడావిడి పడుతోంది. కొడుకూ, కోడలికి, ముఖ్యంగా మనవడికీ ఇంటిని సౌకర్యంగా, అందంగా, శుభ్రంగా తీర్చిదిద్దడంలో వారం రోజుల్నుంచి హైరానా పడిపోతోంది.

○ ○ ○

ఆరోజు రానే వచ్చింది.

ఇంటి ముందు కారు ఆగడంతో హడావిడిగా ధనలక్ష్మి, ఆ వెనుక మాధవరావూ బయటికి వచ్చారు.

అచ్యుతం కారు దిగాడు. భార్య చేతుల్లోంచి పిల్లవాడిని అందుకున్నాడు. వాసంతీ దిగింది.

ధనలక్ష్మి గబగబా వెళ్ళింది. కొడుకు దగ్గర్నుంచి మనవడిని అందుకోబోయింది. వాడు రాలేదు. తండ్రి మెడ చుట్టేసుకున్నాడు. "నానమ్మరా! గ్రాండ్‌మా!" అచ్యుతం చెప్పేడు కొడుక్కి. నొసలు చిట్లించి దొంగ చూపులు చూశాడు వాడు.

చుడీదార్‌తో హాల్లోకి వచ్చిన వాసంతి, ఉఫ్ అనుకుంటూ కుర్చీలో కూలబడింది. డ్రైవరు సామాను తెచ్చి లోపల పెట్టాడు. ధనలక్ష్మి గబగబా ఫ్యాను వేసింది. కుర్రాడు అచ్యుతం చంక దిగలేదు.

"జర్నీ బాగా సాగిందా?" మాధవరావు అడిగాడు. చెప్పాడు అచ్యుతం.

ధనలక్ష్మి మాటలకి వాసంతి 'ఊ, ఆఁ' అంటూ సమాధానాలు చెప్పింది. ఓ పావుగంట కూర్చుని, కాస్సేపు పడుకోవాలన్నది వాసంతి.

వాళ్ల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గది చూపించింది ధనలక్ష్మి. ఫ్యాను వేసింది. వాసంతి పడుకుండిపోయింది.

"విమానంలో చాలాసేపు కూర్చున్నాం కదా! దానికి తోడు వాతావరణం కూడా మారిపోయింది. అలాగే ఉంటుంది" అన్నాడు అచ్యుతం. ధనలక్ష్మికి అదేం అర్థం కాలేదు.

కుర్రాడిని వాసంతి దగ్గర పడుకోబెట్టి అచ్యుతం బాత్‌రూమ్‌కు వెళ్లి ముఖం కడుక్కుని వచ్చాడు. తల్లి వేడిగా కాఫీ ఇచ్చింది.

"ఎలా ఉన్నారు నాన్నా?" హాల్లో తండ్రి కెదురుగా కూర్చుంటూ అడిగాడు అచ్యుతం.

"మాకేం... బాగానే ఉన్నాంరా... మీరెలా ఉన్నారక్కడ?" మాధవరావు అడిగాడు.

"చాలా బిజీ లైఫ్ నాన్నా. పరుగులు పెట్టడమే"

"కోడలు ఏమన్నా ఉద్యోగం చేస్తోందా?" ఆసక్తిగా అడిగింది తల్లి.

"ఇంకా లేదమ్మా. ఇప్పుడు చేస్తానంటోంది"

ఇంతలో మంచం దిగి మనవడు వస్తుంటే, చటుక్కున పట్టుకుని ముద్దు పెట్టుకోబోయింది ధనలక్ష్మి. వాడు గింజుకుని ఏడుస్తూ తండ్రి వడిలో దూరి పోయాడు.

వాడి ఏడుపు అవాంతరానికి గదిలో పడుకున్న వాసంతి విసుక్కున్నది.

"కొత్త కదా ధనం. రెండు రోజులు పోతే కాస్త అలవాటు పడతాడు" మాధవరావు చెప్పాడు భార్యకి.

మనవడిని ఎత్తుకుని గుండెలకు హత్తుకుని ముద్దాడాలని మహా ఇదిగా ఉంది ఆమెకు.

వాడు ఎంతకీ తండ్రి వడిలోంచి దిగిరాలేదు.

తన ఉద్యోగం గురించీ, అక్కడి వాతావరణం గురించీ అచ్యుతం తండ్రికి చెబుతున్నాడు.

"ఒరే ఎప్పుడు తిన్నారో ఏమిటో! అమ్మాయిని కూడా లేపు. భోజనం చేద్దురుగాని" అన్నది ధనలక్ష్మి.

"లేదమ్మా! భోజనం చేసే వచ్చాం. మధ్యలో బాగా ఆకలిగా అనిపిస్తేనూ..." అచ్యుతం నెమ్మదిగా చెప్పాడు తల్లి ఎక్కడ నొచ్చుకుంటోందోనని.

"అయ్యో... తినే వచ్చారా?"

కాస్సేపు అవీ ఇవీ మాట్లాడి అచ్యుతం కూడా వెళ్లి పడుకున్నాడు.

మధ్యాహ్నం రెండు గంటలు కావస్తోంది.

భర్తకి టీ పెట్టి ఇచ్చి, తానూ తాగింది ధనలక్ష్మి.

సాయంత్రం నాలుగు గంటలు కావస్తోంటే అచ్యుతం లేచాడు. కొడుక్కి టీ ఇచ్చింది ధనలక్ష్మి. వాసంతి ఎప్పుడో ఐదున్నరకి నిద్ర లేచింది.

దిండు ఎత్తుగా వేసుకుని మంచం మీదనే అలా కూర్చుండి పోయింది.

"కాస్త టీ ఇమ్మంటావా?" ధనలక్ష్మి అడిగింది.

అస్పష్టంగా తలూపింది వాసంతి.

కాస్త డికాషన్ ఎక్కువ వేసి, చిక్కటి పాలుపోసి కోడలి కోసం స్పెషల్‌గా టీ చేసి తీసుకెళ్లి అందించింది ధనలక్ష్మి.

అచ్యుతం భార్యకేసి చూశాడు. ఆమె టీ సిప్‌చేసి ముఖం అదోలా పెట్టింది.

తల్లి ఎక్కడ గమనిస్తుందోనని కంగారుపడ్డాడు అచ్యుతం. కానీ, సరిగ్గా ఆ సమయంలోనే మాధవరావు భార్యని పిలవడంతో ధనలక్ష్మి ఇవతలకి వచ్చేసింది. కోడలు ముఖంలో భావాలు ఆమె చూడలేదు.

ఎప్పుడో ఏడుగంటలకి వాసంతి మంచం దిగింది. స్నానం చేసింది. నిరాసక్తంగా హాల్లో కూర్చుంది.

"అక్కడెలా ఉంటుంది వాసంతీ?" అనడిగింది ధనలక్ష్మి కోడల్ని- ఆమె వడిలో ఉన్న మనవడిని దగ్గరికి తీసుకోవడానికి ప్రయత్నిస్తూ.

వాడు రావడం లేదు.

"ఎలా ఉండేదేంటి? బాగానే ఉంటుంది. ఇల్లు అంతా ఏసీ... చాలా బావుంటుంది" అత్తగారి ప్రశ్నకు సమాధానం చెప్పింది వాసంతి.

ఆ సమాధానంలో అతిశయం కనిపించింది మాధవరావుకి. అచ్యుతం తల్లినీ, భార్యనీ మార్చి మార్చి చూస్తున్నాడు.

ధనలక్ష్మి ఏమన్నా అడిగితే తప్ప, తానుగా వాసంతి మాట్లాడ్డంలేదు.

భోజనాల దగ్గరా అంతే. అన్నీ అయిష్టంగా తిన్నది.

అలానే... దూరం దూరంగా మనవడూ, అంటీ ముట్టనట్టు కోడలు, ఏం చెప్పాలో తెలియక చూపులు తప్పించుకునే కొడుకు... మూడు రోజులు గడిచి పోయాయి.

నాలుగోరోజు పొద్దున్నే ఏడు గంటలకి ఇంటి ముందు కారు వచ్చి ఆగింది.

ధనలక్ష్మికి అర్థం కాలేదు. మాధవరావుకి బాగానే అర్థమయింది.

"వాసంతీ వాళ్లింటికి వెళుతున్నామమ్మా... ఆ తరువాత తిరుపతి వెళదామనుకుంటున్నాం. వీలైతే అన్నవరం కూడా..." అచ్యుతం చెప్పాడు.

వాసంతి చూపించిన పెట్టే బేడా కారులో పెట్టాడు డ్రైవరు.

"అదేమిట్రా... నాలుగు రోజులుండరా?!" అనడుగుదామనుకున్న ధనలక్ష్మి మాట గొంతులోనే ఉండిపోయింది.

కారు కదిలి వెళ్లిపోయింది.

భార్య భుజాల మీద చేతులు వేసి లోపలికి నడిపించుకుని వచ్చాడు మాధవరావు.

ఆమె కళ్లలో నీళ్లు...

"అమ్మమ్మా!" ఎప్పుడొచ్చిందో కూతురు- ఆమె కొడుకు- తమ మనవడు ధనలక్ష్మి కాళ్లని చుట్టేసుకున్నాడు.

అమాంతం వాణ్ణి ఎత్తుకుని గుండెలకు హత్తుకుని, ముద్దులు పెట్టేసుకుంది ధనలక్ష్మి.

అప్పుడుగానీ ఆమె ఆరాటం చల్లారలేదు.

■